# పొద్దు తిరుగని పూలు

లేళ్లపల్లి వెంకట లక్ష్మీనారాయణ శర్మ



ప్రొద్దున ఏడుగంటలయ్యింది.

"నీళ్ళు చల్లారిపోతున్నయ్ ... గెడ్డం గీసుకోవటం యింకా అవలేదూ?" అంటూ వంటింట్లోంచి సుభద్ర ఒక పొలికేక పెట్టింది. సుభద్ర నా భార్య. సుభద్ర మామూలుగా మాట్లాడితే అరిచినట్లు, అరిస్తే పొలికేక పెట్టినట్లూ వుంటుంది. ఇందులో మొదటి పద్ధతిపట్లకూడా నాకు అసహ్యమే కాబట్టి మా యింట్లో పొలికేకలు కూడా వుండటం కద్దు కానీ యిప్పుడు సుభద్ర పెట్టిన పొలికేకకు బాధ్యుడిని నేనే.

నేను షేవ్‌చేసుకోవటం మొదలుపెట్టినప్పుడే—

"మీరెప్పుడు నీళ్ల తోడమంటే అప్పుడు తోడేస్తాను నీళ్ల కాగినై" అంది...అలా అని వూరుకోకుండా మళ్లీ యింకో అయిదు నిమిషాలకొచ్చి మళ్ళీ ఆ మాటే అంది. ఆలస్యం అయిందేమోనని—

"సరే...నీళ్ళు తోడు" అన్నాను... అదీ నేంజేసిన తప్పు. నే నామాట అనేవేల్టికి గెడ్డంపని అయింది. కత్తెరతో మీసం పని చూస్తున్నాను.

దాదాపు పదేళ్ళనుంచనుకుంటాను యీ మీసంతో పెద్ద అవస్త వస్తోంది. పావుగంటకు పైగా దీని సంగతి చూడాల్సొస్తోంది. కారణం—మీసంలో అక్కడక్కడా తెల్ల వెంట్రుకలు రావటం మొదలుపెట్టినయ్.

నాకు నలభయ్యేళ్లు నిండినయ్ (నలభై నాలుగేళ్లనుకుంటాను). ఏభయ్యో పడిలో పడ్డారంటున్నారందరూ. ఆ మాటల్లో "ఆ...అంతా అయిపోయింది" అన్న అర్థం నాకు వినిపిస్తోంది. అందుకే నాకు బాధ. ఈ మాట నలుగురైదుగురనగా విని నాలుగు యిరుకుపాంట్లూ, నాలుగు బనీన్లలాంటి చొక్కాలు కుట్టించాను అప్పట్నించీ వీటిని వదలకుండా వేసుకు తిరుగుతున్నాను. ఇవి వేసుకుంటున్నప్పుడల్లా—

"బాగుంది...చెప్పేవాళ్లు లేక చెడిపోయావని...బాగుంది వరస" అంటూ పోను యింట్లో.

ఎప్పుడో యిరుకుపాంటు వేసుకున్న మహోత్సవంలో 'ఏం...సుద్భమ్మా?' అన్నాను సుభద్రవంక చూస్తూ. అలా అంటున్నప్పుడు ఆ మాట కొన్ని కొన్ని సమయాల్లో నా వెంటపడి నా చేత వురుకులూ, పరుగులూ తీయిస్తూ నా ప్రాణం మీది కొచ్చిపడ్తుందనుకోలేదు. ఆ మాట దురుద్దేశ్యంతో అన్నదికాదు. కాబట్టి నేనప్పుడంతదూరం ఆలోచించలేదు.

ఆ మర్నాటినుంచీ మొదలయ్యింది నన్ను తరమటం. నేను ప్రొద్దున గెడ్డం గీసుకునేటప్పుడు మొదలవుతుందీ తంతు.

'రోజూ గీసుకోవాలా?' అంటుంది, నేను నా పొది బయటకు తియ్యంగానే.

రోజూ గీసుకోనక్కర్లేదని నాకూ తెల్సు... గెడ్డంమీదా, మీసంమీదా వెధవ్వి... ఆ తెల్ల వెంట్రుకల్రాకపోతే నేనూ రోజూ షేవ్ చేసుకొనకనే పోదును. అలా రోజూ చేసుకొనక పోవటం యీ రోజుల్లో ఫ్యాషన్ కూడాను. ఆ ఫ్యాషన్ పుణ్యమా అని బార్బరుషాపు కెళ్ళటం తగ్గించాను. బార్బరుషాపు కెళ్లొచ్చిన రోజున కణతలకు ప్రక్కనున్న తెల్ల వెంట్రుకలు

కొట్టొచ్చినట్టు కనబడుతున్నదే మరి...

నా బాధేదో నన్నుపడనివ్వదు. తన కెందుకీ అనవసరపు గొడవలన్నీను?

'మీరు త్వరగా తెములాలి...అవతల పిల్లలకు అన్నం వండాలి వాళ్ళ స్కూలు 'టైమయ్యింది' అంటుంది...

...అప్పట్నుంచీ మొదలుపెట్టి నేను తలదువ్వుకునే వేళ్టికి మళ్ళీ నా వెనకాల తయారు.

'ఏం కథ? మళ్ళీ వచ్చావ్...పిల్లలకు అన్నం వండు...వాళ్ళ స్కూలుకు టైం అవటంలా?' అంటాను నేను అద్దంలోనే సుభద్రవంక చూస్తూ.

'మీరు తెమలండి ఏవిటీ అలంకారం?' అంటుంది దీర్ఘంతీస్తూ.

స్వోత్కర్ష అని మీరనుకోనకపోతే ఓ విషయం చెపుతానిక్కడ. అలా నా వెనక నిలబడినప్పుడు అప్పుడప్పుడూ నా వంక తృప్తిగా చూస్తుంది. తన పాపిట మధ్యనుంచి మూడువైపులకు ప్రాకిన తెల్ల వెంట్రుకలపైన చెయ్యి వేసుకుని గట్టిగా నిట్టూర్పు విడుస్తుంది. ఇవన్నీ అద్దంలోంచి గమనిస్తూనే వుంటాను నేను.

'ఏవిటీ? నీరసంగా వున్నావ్?' అంటాను నేను అద్దం మీద నుంచి దృష్టి మరల్చకుండానే.

'మీ అలంకారం చూసి చూసి నాకు నీరసం వస్తోంది. చేసిచేసి మీకు రావటం లేదూ?' అంటుంది బలవంతంగా నవ్వుతూ.

నేను బూట్లు వేసుకుని కుర్చీలోంచి లేస్తూవుండగా 'సుబ్బిగాణ్ణి కాస్సేపు యెత్తుకుని వెళ్ళండి...లేకపోతే వాడేడుస్తాడు తీసుకొస్తానుండండి' అంటూ లోపలికి వెడుతుంది—

'ఊఁ...సుబ్బిగాణ్ణా? అబ్బిగాణ్ణా?' అని నేను మొత్తుకుంటున్నా వినకుండా. సుబ్బిగాడుగా పిలవబడేవాడు మా ఆఖరివాడు.

'అబ్బిగాణ్ణింకా యేంయెత్తుకుంటాళ్లెండి. మీరెత్తుకుంటానన్నా వాడు రాడు' అంటూ ఆఖరివాణ్ణి నా భుజాలమీద కూర్చోబెడుతుంది.

ఈ పెధవాయను యెత్తుకోవటం నాకూ యిష్టమే కానీ వాడిచేతుల్ని చూస్తేనే భయం. వాటికీ, సుద్దముక్కలకీ అదేవిటో అంతులేని సంబంధం. ప్రొద్దున్నేలేచి యెంతో పనివున్నట్టు వాటితో నేలమీద వ్రాసి చేతుల్తో తుడుస్తూ వుంటాడు. ఆ చేతులెక్కడ నా చొక్కాలనిండా పూస్తాడోనని నా భయం...అయినా యీ 'సుబ్బమ్మ' మరీ అధ్వాన్నం. వీణ్ణి నేను స్నానం చెయ్యకపూర్వం తీసుకొచ్చిస్తే పోలా? ...వాణ్ణెలాగో జాగ్రత్తగా యెత్తుకుని దించి 'టా,టా' అంటూ స్కూటర్ బయటకు తీస్తూండగా—

'నాన్నారూ! వచ్చేతప్పుడు చాక్



పీసులు' అంటాడువాడు...ఇంట్లో బొగ్గు ముక్కల్లేవింకా నయమే.

* * *

సుభద్ర యిచ్చిన మూడవ 'రిమైండర్తో' లేచి స్నానాల గదిలోకి వెళ్లబోతూ—

'ఆ సుబ్బిగాడెక్కడ? వాణ్ణిప్పుడే తీసుకురా యెత్తుకుంటాను...తర్వాత యెత్తుకునేదిలేదు . . . ఇప్పుడే చెపుతున్నాను' అన్నాను.

'చన్నీళ్ళు పోసుకోవాలనుంటే ముందే చెప్పరాదుటండీ. . . వేడినీళ్లుపెట్టి నేను వాళ్లహూనం చేసుకోవటం యెందుకు? వాణ్ణెత్తుకూర్చుంటారా యిప్పుడు?!... బాగుంది వరస . . . చెప్పేవాళ్లు లేకపోతేసరి అంటూ ప్రత్యక్షమయ్యింది.

చెప్పేవాళ్ళు లేకేం? నేను నీళ్ళగదిలోకి పరుగెత్తాను.

సాయంత్రం యింటికి తిరిగి వచ్చేవేళకి సుభద్ర గడపలోనే ప్రత్యక్షమయింది. ముఖంలో యేదో క్రొత్తదనం కనిపిస్తుంది. ఆఁ అర్థమయ్యింది. నుదుటిమీద గుమ్మడిగింజ మాదిరి తిలకం దిద్దుకుంది. అది 'దోసగింజ' బొట్టట. తర్వాత తనే చెప్పింది. ఆ ముఖంమీద దోసగింజ బొట్టు పెడితే బ్రహ్మరుద్రుడికూడా కనిపించదు. కొంచం భారీమనిషి మరి ఆసంగతి తనకుతెలుసు. అందుకే గుమ్మడిగింజంత బొట్టు పెట్టుకుంది. నేస్కూటర్ దిగంగానే నావంకే చూస్తూ నవ్వింది. ఇప్పుడనండి "సుబ్బమ్మ" అని— చెప్పేవాళ్ళు లేకపోతేసరి అన్నట్టుగా నవ్వు. నేనేమీ అనలేదు.

పిల్లలేరీ? ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. అని మాత్రం అన్నాను.

"వాళ్ళ స్కూల్లో యేవో నాటకాలున్నాయట. అన్నాల్తిని యిప్పుడే వెళ్ళారు. రాత్రిపదింటికొస్తార్ట" అంది.

మా అమ్మాయి (సరోజ) ఆఖరివాణ్ణి తీసుకొని బయటికొచ్చింది. సుభద్ర లోపలికి వెళ్ళింది. నేనింకా టైట్‌పాంట్ల మహోత్సవంలో వుండి పట్టించుకోవటం లేదుగానీ సరోజ పెళ్ళీడు కొచ్చింది. ఈ కాలం పోకడను పట్టిచూసినా దానికి మూడు నాలుగేళ్ళల్లో పెళ్ళిచెయ్యాలి.

కాఫీ త్రాగుతూ వాళ్ళంతా నాటకాలకెళ్ళారుగా. మనం సినిమా కెడదామా యేమిటి అన్నాను.

ఆఁ వెడదాం. సినిమాకెళ్ళిచాలారోజులయ్యింది. కాని యిదొకర్తి యింట్లో వుండగలదంటారా? అంది సుభద్ర.

'ఇంట్లోవుండటం యెందుకూ. మనతో వస్తుంది. మీరు ముగ్గురూ రిక్షాలో బయల్దేరండి. నేను స్కూటర్‌మీ దొస్తాను' అన్నాను.

'ఆఁ వద్దులెండి ఏమి సినిమాలు? తలకాయనొప్పి సినిమాలు' అని మళ్ళా వెంటనే అందుకుంటూ—

'అన్నట్లు సరళ ఉత్తరం రాసింది. శలవులయ్యేలోగా ఒకసారొస్తుందట.'

అంది రేడియో క్రింద పెట్టిన వుత్తరం అందిస్తూ.

సరళ నా ఆఖరి చెల్లెలు. మొన్ననే హైస్కూలు చదువు పూర్తి చేసింది. ఈ యేడాది కాలేజీలో చేర్చాలి. ఉత్తరం చదివి రేడియోమీద పడేశాను. నేనేం మాట్లాడలేదు. సరళ యిదివరకు రెండు మూడు తడవలొచ్చిందిక్కడకి. అప్పుడు సుభద్ర నానా రభసా చేసింది. "అత్తా-కోడళ్లు", "వదినా-ఆడపడుచులూ"—వాళ్ల మధ్య వర్గపోరాటం తప్పదన్న దృక్పథంతో ప్రవర్తించేది సుభద్ర. సరళలో అభిమానంపాలు యెక్కువ. పౌరుషంకూడా యెక్కువ. కానీ యేదన్నా మాట తనమీద పడితే యెదురుతిరిగి అనకుండా నాపరువేదో నిలబెట్టాలన్నట్టు తనే లోలోపల బాధపడేది. దాని ముఖం చూస్తే యేదో జరిగిందన్న అనుమానం నాకొచ్చేది. కానీ తనంతట తానేమాటా చెప్పేదికాదు. నేను ప్రత్యక్షంగా ఈ విషయాలేమీ యెత్తకుండా సుభద్రకు నీతి బోధల్చేసేవాణ్ణి. కాని వంటిల్లు యిల్లాలికి, తన వుద్దేశ్యాలు ఆచరణలో పెట్టటానికి బలమైన కేంద్రం అనీ ఆ స్థానబలిమితో యింటినొక నరకంగా చేయగల శక్తి యిల్లాలి కుందనీ, త్వరలోనే గ్రహించాను. ఇందువల్లనే కాబోలు తల్లులు కొడుకులదగ్గిరకంటే కూతుళ్ల దగ్గిర యెక్కువకాలం వుండగల్గుతారు

మొత్తానికి సరళ యిక్కడకొచ్చినప్పుడల్లా సంతోషంగా తిరిగి యెప్పుడూ వెళ్లలేదు. అయినా అప్పుడప్పుడూ మా అమ్మయితే మిగతా పిల్లల్ని చూట్టానికి వస్తూనే వుంటుంది. దానికదోపిచ్చి.

'ఏం మాట్లాడరేం' అంది సుభద్ర.

'ఏం మాట్లాడాలి ? సినిమా వద్దన్నావుగా?' అన్నాను.

'సినిమా సంగతి కాదండీ. సరళ ఉత్తరం సంగతి' అంది.

'నేనేం అంటానో నీకూ తెల్సు. రేపే ఉత్తరం రాస్తాను'.

'అట్లా యేంరాయకండి. ఇక్కడ కాలేజీలో చేరి చదువుకోవచ్చు. ఆ ప్రయత్నంలోనే రమ్మని రాయండి. మళ్లీ వెనక్కీ ముందుకీ యెన్ని తడవలు వెడుతుంది?' అంది సుభద్ర.

నే నాశ్చర్యపోయాను. ఏమి టీ మార్పు?


'ఏవిటీ, నువ్వేనామాట్లాడేది?' అన్నాను సుభద్రవంకే చూస్తూ

'నన్నందరూ అనుమానించి ఆడిపోసుకునే వాళ్ళే; నా మనస్సెవ్వరూ గ్రహించరు... ఆ వూళ్ళో మీ యింటికీ కాలేజీకీ చాలాదూరం. ఈ వూళ్ళోఅయితే మనకి అద్దెకొంపేగదా... కాలేజీకి దగ్గర్లోనే ఒక యిల్లు తీసుకుందాం' అంది.

నా చెవుల్ని నేనే నమ్మలేక పోయాను. ఎంతమారిపోయింది సుభద్ర?! ఆమె వంకే చూస్తూ కూర్చున్నాను.

'ఏవిటలా చూస్తున్నారు? పదండి.






యివ్వాళ తొందరగానే భోంచెయ్యొచ్చు' అంటూ లేచింది.

'ఏం నువ్వన్నంపెట్టుకోలేదేం ?' అన్నాను... పీటమీద కూర్చుంటూ.

'మీరు మొదలుపెట్టండి. నేను తెచ్చుకుంటాను. ఇవ్వాళనుంచీ నేనూ చపాతీలు తింటాను' అంటూ ప్లేట్లో రెండు చపాతీలు తెచ్చుకుని కూర్చుంది.

'ఏవిటీ, యివ్వాళ యిన్ని మార్పుల్తో నాకర్థం గాకుండా తయారయ్యావ్?' అన్నాను.

'నన్నొకప్పుడర్థం జేసుకున్నారు గనుకనా? "సుబ్బమ్మ" అని పిలవటం మాత్రం చేతనవును' అంది.

ఇంతవరకూ హాయిగా వున్న వాతావరణం మళ్ళీరణరంగం అయ్యేట్లుందని-

'కానీ...తర్వాత మాట్లాడ్దాం' అన్నాను అన్నం కలుపుకుంటూ.

* * *

సరళ వచ్చింది. సరళని కాలేజీలో చేర్పించేదాకా నిద్రపోలేదు సుభద్ర. నన్నూ నిద్రపోనివ్వలేదు. తర్వాతో పదిరోజులకు కాలేజీప్రాంతంలోనే ఒక యిల్లు అద్దెకు తీసుకుని దాంట్లోకి మారాము. ఈ రెండుపనులు నా కంఠం మీదకూర్చుని చేయించింది సుభద్ర. నాకు మాత్రం యిదంతా అగమ్యగోచరంగావుంది.

కొత్త యింట్లోకి నిన్ననే మారాము. నేను షేవ్ చేసుకోవటం మొదలుపెట్టాను.

మాకు పాతయింట్లో వతనగా పాలు పోసేవాడు యీ ప్రాంతంలోని తన చుట్టానికి యీ వతన అప్పగించాడు. అతను యిల్లు వెతుక్కుంటూ కొంచెం ఆలస్యంగా వచ్చాడు. వాకిట్లో సుభద్ర అతనికి నిబంధనలన్నీ చెపుతోంది.

'నువ్వు ప్రొద్దున ఆరింటికల్లా రావాలి. రోజూ ప్రొద్దున రెండు లీటర్లూ, సాయంత్రం రెండులీటర్లూ కావాలి మాకు; మా ఆడపడుచూ వాళ్ల వచ్చారు ... మళ్లీ సాయంత్రం నాలుగ్గంటలకల్లా తీసుకురావాలి. మా ఆడపడుచూ వాళ్ల నాలుగున్నరకల్లా కాలేజీనుంచొస్తారు. కాఫీ తయారుగా వుండాలి' అంటోంది.

సుభద్ర సరళపట్ల యిప్పుడు చూపించిన అపేక్షకిమాత్రం నాకు నిజంగా మతిపోయినంత పనయ్యింది. వరండాలోకి వచ్చాను. మేమింకా యీ ప్రదేశానికి క్రొత్త. చుట్టుప్రక్కల వాళ్ళింకా రాకపోకలు చెయ్యటం మొదలుపెట్టలేదు. కానీ 'యీ యింట్లో కెవరొచ్చారో' నని కాబోలు ప్రక్కయిళ్లల్లోవాళ్లు కొందరు తొంగి చూస్తున్నారు. పరిస్థితి నాకర్థమయ్యింది. వీళ్లముందు తను ఆడబడుచును యెంతయిదగా దగ్గరవుంచుకుని చదువు చెప్పిస్తున్నానో చూడండని తెలియ జేసేందుకే పాలవాడితో ఆవిధంగా మాట్లాడివుంటవచ్చు సుభద్ర.

'ఇదైనా ఒకందుకు నయమే... ఎన్నాళ్లిట్లా వుంటుందో చూద్దాం' అనుకుంటూ లోపలికి నడిచాను.

సుభద్ర ఆ సాయంత్రం మా ప్రక్క బజార్లోవున్న గుడికి సరళనీ. సరోజనీ తీసుకువెళ్ళింది. మా అమ్మాయి తల్లితో కలసి బయటకువెళ్లటం చాలారోజుల తరవాత చూశాను. సుభద్ర బయటకు వెడితే సామాన్యంగా మా ఆఖరివాణ్ణి తీసుకువెడుతుంది. వీళ్ళు గుడినుంచి యింటికి తిరిగొచ్చిన కాస్సేపటికి ప్రక్కింటి గంగాభాగీరథీసమానురాలొకావిడ—

'నాయనా! అమ్మాయుందాయింట్లో... మేమీ ప్రక్కయింట్లోనే వుంటున్నాం... మా అబ్బాయి తాలూకా ఆఫీసులో పనిచేస్తున్నాడు... చూసిపోదామని వచ్చాను...నువ్వెక్కడ పనిచేస్తున్నావ్ నాయనా?' అంటూ వచ్చింది.

ఆవిడ. మావాళ్ళుయింట్లోకి రావటం చూసే బయల్దేరొచ్చివుంటుంది. అయినా 'అమ్మాయుందాయింట్లో' అంటుంది.

'కూర్చోండిపిన్నిగారూ! మా ఆవిణ్ణి పిలుస్తాను' అంటూ లోపలికెళ్లాను. సుభద్రని వరండాలోకి పంపించాను. మా అమ్మాయి, సరళ కూడా వెళ్లారు.

'రామ్మా... క్రొత్తవాళ్లెవరో యింట్లో దిగారంటేను చూసిపోదామనొచ్చాను ... ఆ ... మీ పిల్లలా ...







రత్నాల్లావున్నారు'. అంటోంది పిన్నిగారు.

'ఆఁ...యీ అమ్మాయి మా చివరి ఆడపడుచు...ఇక్కడే కాలేజీలోచేరారు. కాలేజీకి దగ్గరగావుంటుందని యీ యింట్లోకి మారాం. మావారి ఆఫీసుకి దూరమనుకోండి...అయినా ఆయనకు స్కూటరుంది. మా పిల్లల స్కూళ్ళకి దూరమేననుకోండి ... అయినా... స్కూల్‌బస్ వస్తుంది ... మార్కెట్టు దూరమేననుకోండి ... అయినా ....' అంటూ మామూలుగా ఆడవాళ్ళపద్ధతిలో సంభాషణ కొనసాగించింది సుభద్ర.

ఒక అరగంట అవీయివీ మాట్లాడి పిన్నిగారు వెళ్ళిపోయారు.

...రాత్రి పన్నెండింటిదాకా యేదో నవల చదువుతూ డ్రాయింగ్‌రూంలో కూర్చుండిపోయాను. తలుపుల గడియలన్నీ సరిగా వేశారో లేదో చూసి గదిలోకి వెళ్లాను

సుభద్ర నిద్రపోతూంది... గుమ్మడిగింజబొట్టు... భారీశరీరం ... సుభద్ర ప్రక్కనే యేదో వారపత్రిక తెరచి వుంది. నిద్రావటం లేదు. పడుకుని

ఆ పత్రిక చేతిలోకి తీసుకున్నాను. ఏదో ప్రకటనలపేజీ అది...పేజీ త్రిప్పబోతూ ఆగాను... ఆ బొమ్మలో యిద్దరుస్త్రీలున్నారు. "అక్కా చెల్లెళ్లనుకుంటున్నారా? ... కాదు... వీరిద్దరూ తల్లీ కూతుళ్ళు!!... రహస్యంయేమిటో తెలుసా" అన్నది ఆ పేజీపైన వ్రాసిన దాని సారాంశం. క్రింద రహస్యం యేమిటో చెప్పారు. ఆ మందు బొమ్మ కూడావుంది. అది సుభద్ర అలమరలో చాలాసార్లు చూశాను...ఇదంతా చదివి మళ్లీ పేజీ త్రిప్పబోతూ వుండగా తళుక్కుమనొక ఆలోచనవచ్చింది. సుభద్రవంక చూసాను.

...గుమ్మడిగింజ బొట్టు ... భారీ శరీరం...

సరోజను సుభద్ర పక్కగా వూహించుకుని చూశాను. "తల్లీ_కూతురూ" మాదిరే కనిపించారు. అంతే కాదు "తల్లీ-చిన్నకూతురు" మాదిరి కనిపించారు సరళపట్ల సుభద్ర చూపిస్తున్న అభిమానానికి కారణం తెలిసింది. సరోజపట్ల సానుభూతి కలిగింది. కన్నతల్లిగా సుభద్ర పట్ల కోపంవచ్చింది. కానీ ఆ కన్న మమకారమే యింత చుట్టుతిరుగుడుగా నయినా సరోజను తల్లికి దగ్గరగా చేర్చింది. సరళ వచ్చిన దగ్గర్నుంచీ సరోజ సుభద్రకలని కనిపిస్తున్నారు.


వయస్సుతోబాటు మనస్సు జీవిత ప్రయాణంలో సగం దూరంవరకే చెట్టా పట్టాలు వేసుకుని నడుస్తుంది. వయస్సు పడమరకు తిరుగుతుంటే మనస్సు తూర్పువైపునకు లాగుతుంది. ఇదిసహజం ... జీవితంలో రెండవ యామ ప్రారంభంలో వయస్సుకీ మనస్సుకీ యీ సంఘర్షణ తప్పదు. రాజీకి రావటానికి కొంతకాలం పడుతుంది. నేను నా ప్రపంచం గురించే ఆలోచించుకున్నాను గానీ సుభద్ర ప్రపంచం గురించీ అందులో ఆమె. నేను ఎట్లా వుండాలనుకుంటున్నానో అట్లాగే తనూ వుండాలనుకుంటుందనీ నేనాలోచించలేదు. సుభద్రా _ నేనూ వయస్సుతో యింకా రాజీకిరాలేదు.

నేను వయస్సుతో యింకా రాజీకి రాకపోవటంలో లాభంవుందో నష్టం వుందో నాకు తెలియదు. కానీ సుభద్ర విషయంలోమాత్రం ఒక లాభంవుంది. ఆమె తనవయస్సుతో రాజీకిరానంత కాలం సరళ నా యింట్లో వుండగలదు. స్వార్థం ఒక్కొక్కప్పుడు మంచికి కూడా దారితీస్తుంది. తన వయస్సులో రాజీకిరావలసిన అవసరం లేకుండా సుభద్రకు చపాతీలు సహాయం చేస్తాయన్న నమ్మకం నాకులేదు.

సుభద్రవంక చూశాను.

...గుమ్మడిగింజ బొట్టు ... భారీ శరీరం.

అయినా సుభద్ర నాకందంగా కనిపించింది. సంకుచిత మనస్తత్వాన్ని కొంతవరకూ సడలించుకోగా బయల్పడిన అందం యిది. అందుకే చాలా అందంగావుంది.




"అంజనీ !"

"వస్తున్నా." అన్నదే కాని ఆమె రాలేదు. మరో పదినిమిషాలు చూసి తనే లేచి వంటయింటి దగ్గరకు వెళ్లాడు శ్రీహరి. చెంగు నడుముచుట్టు బిగించి, జంతికల గొట్టంతో నిల్చుంది. ప్రక్కనే వంటమనిషి మంగమ్మ చిల్లుల గరిటతో జంతికలు తిరగేస్తూంది. ముప్పైఅయిదేళ్ళ అంజనీ పాతికేళ్ళ పడుచులా ఉంటుంది. సన్నగా, తెల్లగా చిన్నపిల్లలా ఉంటుంది.

"అంజనీ!"

"మీరు ఇక్కడికే వచ్చారా? మంగమ్మా! మిగతావి పూర్తిచెయ్యి."

"మంచిదమ్మా."

అంజని చేతులు కడుక్కుని బయటకువచ్చింది.

"ఇక మదనుడు వస్తే నా ముఖం చూడవు కాబోలు!"

"చూస్తానో చూడనో మీకు తెలుసు." అన్నది చిన్నగా నవ్వుతూ

"అంజనీ! నిన్నూ మదనుడినీ చూస్తే అక్కాతమ్ముళ్లలా ఉంటారు."

"అందుకే హాస్టల్లో వాడినందరూ, 'మారుటి తల్లి' అని పిలుస్తారట."